క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశంలో 14 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. ఈసమావేశానికి అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.

ప్రసన్నాంజనేయుడికి సహస్ర కదలీ ఫలార్చన


అలంకరణలో ఆంజనేయ స్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామివారికి మంగళవారం అమావాస్య సందర్భంగా పదివేల అరటిపండ్లతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి 11 ఆవృత్తాలుగా 10 వేల అరటిపండ్లతో పూజా నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

18 తేదీ లోపు పంట నష్టం అంచనాలు


మాటాడుతున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకి: పంట నష్టం అంచనాలను ఈనెల 18వ తేదీ లోపు తయారు చేయాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వో, వీఆర్‌ఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని పరిశీలించి నివేదిక తయారు చేయాలని చెప్పారు. పంట గణన పూర్తయిన తరువాత సోషల్ ఆడిట్ నిర్వహించి జాబితాలను ప్రచురిస్తారన్నారు.

జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం

- జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి అనిల్ కుమార్


వల్లాపల్లిలో ఫ్లోరిన్‌పై అవగాహన కల్పిస్తున్న అనిల్ కుమార్

బల్లికురవ: ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దలో మంచి పౌష్టికాహారం ఉందని.. ప్రతి రోజు పాఠశాలలోనే విద్యార్థులు భోజనం చేయాలని జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి అనిల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరిన్ నీరు తాగటం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. రక్షిత పథకాలు, ఆర్‌వో ప్లాంట్‌ల ద్వారా అందిస్తున్న నీరునే తాగాలన్నారు. విద్యార్థులకు ఇంటివద్ద కాల్షియం,ఐరన్ ఉన్న ఆహారాన్ని అందించాలని, పాఠశాలలో రాగి జావ, చిక్కిలు ప్రతి విద్యార్థి తీసుకోవాలని అనిల్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చింతల రామకృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం దొంగ ఓట్లు తొలగించాలి

- ఈఆర్వోకు ఆమంచి వినతి


అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

పర్చూరు (చినగంజాం): నిబంధనల ప్రకారం దొంగ ఓట్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరారు. ఓటర్ల జాబితా సవరణపై పర్చూరు తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. పర్చూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య దొంగ ఓట్లకు సంబంధించి వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో ఆమంచి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని ఈఆర్వోను ఆయన కోరారు. పార్టీలకు అతీతంగా బీఎల్‌ఓలు విధులు నిర్వహించేలా చూడాలని, చనిపోయిన వారి ఓట్లు ఇంతవరకు ఎందుకు తొలగించలేదని ఆమంచి ప్రశ్నించారు. 2014 ఎన్నికల సమయంలో ఉన్న ఓటర్ల జాబితాని ముసాయిదా రూపంలో మళ్లీ వచ్చిందని గుర్తు చేశారు. అందులో ఎలాంటి మార్పులుచేర్పులు చేయలేదని సమావేశంలో వివరించారు. కిందిస్థాయి అధికారులు పనిచేయలేదని అనడానికి ఇది నిదర్శనమన్నారు. దుద్దుకూరు గ్రామంలో చెరువుకట్టపై కూర్చొని విచారణ జరిపినట్లు అధికారులు నివేదిక ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఆమంచి విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. వివాహం అనంతరం భర్త ఊరిలో భార్య ఓటు కూడా ఉండాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిర నివాసం ఉంటున్న వారి ఓట్లు ఎక్కడ ఉండాలో మీరే చెప్పాలని ఈఆర్వోని ఆమంచి ప్రశ్నించారు.

మీ సేవా కేంద్రంలో దొంగ ఓట్లు చేర్చారు..

2014–19 సంవత్సరాల్లో మార్టూరు మీ సేవా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయని ఆయన ఆరోపించారు. అప్పటి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దానిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి ఎన్ని ఫారం–7 అయినా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. 5 కంటే ఎక్కువ ఫారం–7 లు దరఖాస్తు చేస్తే త్రిసభ్య కమిటి విచారణ చేయాల్సి వస్తుందని వివరించారు. ఎక్కువ ఫారం–7 లు పెట్టటం నేరం కాదన్నారు. దొంగ ఓట్లపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమంచి కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు. కె. సంజశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పాళ్ల రాఘవయ్య, కూరకుల విశాఖ్, అడపా సుధాకర్‌రెడ్డి, నూతలపాటి బలరాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట శివనాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే ఓటు హక్కు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, ఆర్డీవో సరోజిని

చీరాల టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు కల్పిస్తామని చీరాల ఆర్డీవో, ఎన్నికల అధికారి పి.సరోజిని సూచించారు. మంగళవారం సాయంత్రం చీరాల తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్వో సమావేశాన్ని నిర్వహించారు. అదనపు ఎన్నికల అధికారి, చీరాల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో సరోజిని హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతనంగా ఓటు నమోదు, మార్పులు, మృతిచెందిన వారి ఓట్లు తొలగింపు, ఓటరు సర్వే బూత్ లెవల్ అధికారులతో నిష్పక్షపాతంగానే చేస్తున్నామన్నారు. ఎవరి ఓట్లు తొలగించడం లేదని, అనర్హులకు ఓటు హక్కు కల్పించడం లేదన్నారు. సమావేశంలో చీరాల, వేటపాలెం తహశీల్దార్లు ప్రభాకరరావు, అశోక్‌వర్ధన్, డిప్యూటీ తహశీల్దార్లు సురేష్, ఆదినారాయణ, మున్సిపాలిటీ ఏవో ఉమా, పట్టణ, రూరల్ మండలాల ఆర్ఐలు అర్జున్, శేఖర్, బీజేపీ, టీడీపీ, సీపీఎం పలు పార్టీ నాయకులు ఉన్నారు.

సీఎం జగన్, వైవీకి కృతజ్ఞతలు



అద్దంకి: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా పీ హనిమిరెడ్డి నియమితులయ్యారు. తన ఎంపికకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి సాక్షితో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రికి, అద్దంకి అభివృద్ధికి పాటుపడి, నమ్మకాన్ని నిలబెడతానన్నారు.

నూతన ఇన్‌చార్జిని కలిసిన నేతలు

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన ఇన్‌చార్జిగా నియమితులైన పీ హనిమిరెడ్డిని గుంటూరులోని ఆయన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు తామంతా కృషిచేస్తామని ఇన్‌చార్జితో చెప్పారు.

20న అద్దంకి మండల సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20 వతేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవసేనకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

యూ డైస్ యాప్‌పై అవగాహన తప్పనిసరి

కారంచేడు: ప్రభుత్వం అమలు చేస్తున్న యూ డైస్ (డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ ఎడ్యుకేషన్) యాప్‌పై ప్రతి ఒక్క ప్రధానోపాధ్యాయుడు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు అన్నారు. మంగళవారం వారు మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. యూ డైస్ యాప్ ద్వారా ప్రతి హెచ్ వారి పాఠశాలలకు అవసరమైన మౌళిక వసతులు, విద్యార్థుల హాజరు, వారికి అసవరమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి అనేక అంశాలను క్షుణ్ణంగా యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలకు కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు మాస్టర్ ట్రైనర్‌గా శిక్షణనిచ్చారు.

విద్యాభివృద్ధికి ట్రస్ట్ తోడ్పాటు

అద్దంకి: విద్యాభివృద్ధికి తోడ్పాటునివ్వడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి గంగాధర్ అన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రోటరీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని విప్పర్లవారిపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే కుర్చీలు, రాత పుస్తకాలు, పలకలు, టీఎల్‌ఎమ్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనూరాధ, రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు


పీఈటీలకు సూచనలందిస్తున్న ఎంపీడీవో నేతాజీ, ఎంఈవో

చీరాల టౌన్: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా వేగంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ఎంపీడీవో కె.నేతాజీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్నీ పంచాయతీల కార్యదర్శులు, పీఈటీలతో ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో నేతాజీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాల్లో మండలంలోని అన్నీ సచివాలయాల పరిధిలోని 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు 6819 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, పోటీల్లో పాల్గొనే వారు బుధవారం సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో ఈనెల 15 నుంచి 20 తేదీ వరకు, మండల స్థాయిలో ఈనెల 21 నుంచి జనవరి 4 వరకు జరిగేక్రీడా సంబరాల్లో ప్రతి ఒక్కరిని విధిగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో మహిళలు కూడా పాల్గొనవచ్చన్నారు. పోటీలు పూర్తయిన తర్వాత క్రీడా సామగ్రిని తిరిగి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రాకు గ్రామస్థాయిలో సమన్వయ కమిటీ సభ్యులైన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, మహిళా పోలీసు, స్కూల్ హెచ్‌ఎం, పీడీ, పీఈటీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సమన్వయంతో కృషి చేసి ఆడుదాం ఆంధ్రాను మండలంలో విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు పి.సుబ్రమణ్యం, ఇ.సుధారాణి, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ విజేతలకు సత్కారం


క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విస్తర్ల బాబురావు

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్‌లో సత్తా చాటడం అభినందనీయమని జిల్లా షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విస్తర్ల బాబురావు అన్నారు. ఈనెల 8,9,10 తేదీల్లో మార్టురులో 42వ అండర్–19 జూనియర్ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 18 జిల్లాలకు చెందిన బాల, బాలికలు పాల్గొని తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. ఫైనల్లో గుంటూరు జిల్లా జట్టుపై 2–0 తేడాతో గెలిచి విజేతగా నిలిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈసందర్భంగా మంగళవారం విజేతగా నిలిచిన జిల్లా జట్టు సభ్యులను జిల్లా అధ్యక్షుడు బాబురావు చీరాలలోని తన ప్రేమ నర్సింగ్ హోమ్‌కు క్రీడాకారులను ఆహ్వానించి అభినందించారు. క్రీడాకారులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినినాటి నుంచి జిల్లా జట్టుకు ఇది మూడో విజయం కావడం ఎంతో సంతోషకరమన్నారు. క్రీడాకారులకు తన వంతు సాయం ఎల్లప్పుడు అందిస్తానని భరోసా కల్పించారు.




బాలినేనికి పుట్టిన రోజు శుభాకాంక్షలు



సాక్షి నెట్‌వర్క్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఒంగోలులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ పోతుల సునీత దంపతులు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య బాలినేని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగనన్నే ఉండాలి


లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల పత్రాన్ని అందిస్తున్న పార్టీ నాయకులు

చీరాల టౌన్: రాష్ట్రాభివద్ధితో పాటు రాష్ట్రం సంక్షేమ రాష్ట్రంగా కొనసాగాలంటే సీఎం మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని గవినివారిపాలెం, దేవినూతల గ్రామ పంచాయతీల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సామాజిక వర్గానికి, ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి కలిగిన మేలు, రాష్ట్ర ప్రగతి గురించి కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరిగి కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ఎ.అంకాళరెడ్డిలు వివరించారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివద్ధి, పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు, నవరత్నాలు మళ్లీ అందరికి అందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వకుండా మేనిఫెస్టోలో చేర్చిన ప్రతీ హామీని నెరవేర్చి అన్నీ విధాలా ప్రజలకు అండగా నిలుస్తున్న జగనన్నకు అండగా నిలవాలన్నారు. అనంతరం సచివాలయాల వారీగా సంక్షేమ పథకాల బ్రోచర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.శివపార్వతి, బి.సాంబశివరావు, కోటేశ్వరరావు, మురళీ, నారాయణ, రమేష్, శివయ్య, పద్మావతి, ఏసు, సుబ్బారావు, నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పుణ్య స్నానాలు


వాడరేవు సముద్ర తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


అద్దంకిలో వేయి స్తంభాల దేవస్థానంలో స్వామి వారికి పుష్పాభిషేకం

చీరాల టౌన్: కార్తీక మాసం ముగింపు, అమావాస్య పురస్కరించుకుని మంగళవారం సముద్ర తీర ప్రాంతాలకు భక్తులు పోటెత్తారు. చీరాల వాడరేవు, రామాపురం తదితర సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వాడరేవు తీర ప్రాంతానికి బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి, తదితర నియోజకవర్గాల నుంచి భక్తులు సముద్ర స్నానాలకు వాడరేవుకు వచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రసాదరావు పర్యవేక్షణలో రూరల్ ఎస్సై పి.జనార్దన్, మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, ఏఆర్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కార్తీక మాసం ముగింపు పూజలు

అద్దంకి రూరల్: అద్దంకిలో వేంచేసి ఉన్న వింధ్య వాసిని సమేత నగరేశ్వరస్వామి (వేయి స్తంభాలు) దేవస్థానంలో కార్తీకమాసం ముగింపు వేడుకలను ఘనంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారికి అన్నాభిషేకం, విభూది గంధం, బిల్వపత్రం, సుగంధ పరిమళ పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు.

బల్లికురవ: కార్తీక మాసంలో ఆలయాల్లో జరిగే వనసమారాధనలో పాల్గొంటే ఆయురాగోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు సద్ధిస్తాయని చెన్నుపల్లి గంగా పార్వతి సమేత పరుశవేదీశ్వరస్వామి, ఆలయ అర్చకులు సుబ్రమణ్యశర్మ అన్నారు. శివునికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవారిని ప్రత్యేక అలంకరించి కుంకుమ పూజలు పూజలు చేపట్టారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


గ్యాస్ కనెక్షన్‌లు అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించేందుకుకు వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్ తెలిపారు. మంగళవారం కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి గ్రామాల్లో ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే సీఎం జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారని ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, ఎంఈవో కె. రమేష్‌బాబు, ఏపీవో బాలకృష్ణ నాయక్, ఏపీజీబీ మేనేజర్ సుకుమార్, జెడ్పీటీసీ చింత అంజలి, సర్పంచ్ వై శాంతమ్మ, ఎం మోహన్‌రావు, సెక్రటరీ పీఎఆర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ ద్వారా పంటనష్ట వివరాలు


పర్చూరులో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్‌రావు


కొండమంజులూరులో శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి


కొరిశపాడులో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సుశీల, ఏవో శ్రీనివాసరావు

పర్చూరు (చినగంజాం): పంటనష్ట వివరాలు ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయాలని ఏడీఏ మోహన్‌రావు పేర్కొన్నారు. పర్చూరు సబ్ డివిజన్‌లో ఈ నెల 4,5,6 తేదీల్లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ వల్ల 4 మండలాల్లో సూమారు 69,951 ఎకరాల్లో వివిధ పంటలు వరి, పత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న, మినుము, జూట్, శనగ పంటలు దెబ్బతిన్నాయి. శనగ పంట పెరుగుదల దశలో ఉన్నది కనుక ఎవరైనా రైతులు శనగ పంటను తీసివేసి ఈ–క్రాప్ చేయించుకొని 80 శాతం సబ్సిడీ మీద శనగ విత్తనాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సబ్ డివిజన్‌లో వేసిన వివిధ పంటలు వరికి హెక్టారుకు రూ.17,000, మొక్కజొన్న రూ.12,500, మినుము రూ.10,000, పత్తి రూ.17,000, పొగాకు రూ.10,000, జూట్ రూ.8500, జొన్న రూ.8500, కంది రూ.10,000, ఇవ్వనున్నట్లు తెలిపారు. పంట నష్టం వివరాలను ఈనెల 18వ తేది లోపు ఇవ్వాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. 22 లోపు సోషల్ ఆడిట్ చేస్తామని, రైతుల తుది జాబితాను 26వ తేదీన ఖరారు చేస్తామని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే నష్టపరిహారం అందుతుందని తెలిపారు. ఆర్బీకే గ్రామాల వారీగా వీఆర్వో, వీఏఏలతో టీములు వేశామని తెలిపారు.

పంట నష్ట వివరాలు అందించాలి..

జే.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు, కొండమంజులూరు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నష్ట వాటిల్లిన పంటలను మంగళవారం ఏవో సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వలన పంట నష్టాలను అంచనా వేయుటకు గ్రామస్థాయి టీములు ఏర్పాటు చేశామన్నారు.

మేదరమెట్ల: ఇటీవల ఏర్పడిన తుఫాను ప్రభావంతో అధిక వర్షానికి, ఈదురు గాలులకు కొరిశపాడు మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తహశీల్దార్ సుశీల అన్నారు. మండల కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాను తీవ్రతరే 33 శాతం కన్నా ఎక్కువగా దెబ్బతిన్న పంటలను పూర్తిగా పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేలా నివేదికలను తయారు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.